# కన్న కొడుకును కడతేర్చిన తండ్రి అరెస్ట్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రవీందర్‌నాయక్, ఎస్సై మల్లారెడ్డి

నాగిరెడ్డిపేట, జూన్ 15 : కన్న కొడుకు శషాంక్(4)ను కడతేర్చిన తండ్రి అనిల్‌ను ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రవీందర్‌నాయక్ తెలిపారు. నాగిరెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పోచారం గ్రామానికి చెందిన అక్షితను లింగంపేట మండలం పొల్కంపేట గ్రామానికి చెందిన నర్వ అనిల్‌కు ఇచ్చి ఐదేండ్ల క్రితం పెళ్లి చేశారు. వీరికి శషాంక్‌తోపాటు ఆరు నెలల కూతురు ఉన్నది. ఈనెల 10న తన చెల్లెలు ఇంట్లో బోనాల పండుగ కోసం మెదక్ జిల్లా ఘన్‌పూర్ మండలం శాలిపేట గ్రామానికి భార్యాపిల్లలతో కలిసి వెళ్లారు. అక్కడికి వచ్చిన రెండో చెల్లి కూతురు, శషాంక్ ఆడుకుంటుండగా నెట్టడంతో చెల్లి కూతురు మెట్లపై నుంచి కింద పడింది. దీంతో చెల్లికి వీరికి గొడవ జరిగింది. దీంతో భార్యాపిల్లలతో మరుసటి రోజు స్వగ్రామానికి వచ్చారు. ఈ గొడవ విషయంపై భార్య అక్షితతో గొడవ పడిన అనిల్ ఆమెను తీవ్రంగా కొట్టాడు. 12న భార్యా పిల్లలను తీసుకొని అక్షిత తల్లి గారి ఊరు పోచారం వచ్చాడు. స్థానికంగా వైద్యం చేయించాడు. ఆడుకుంటున్న కొడుకును తన బైక్‌పై ఎక్కించుకొని బయట తిప్పుతానని తీసుకెళ్లాడు. గ్రామ శివారులోని ఎల్లమ్మ దేవాలయం సమీపంలో గొంతు, ముక్కును అదిమి పట్టి ఊపిరాడకుండా చేసి హత్య చేశాడు. భార్య అక్షిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. మెదక్ జిల్లా హవేళి ఘన్‌పూర్ మండలం బూర్గుపల్లి గేట్ సమీపంలో పారిపోతుండగా పట్టుకొని అరెస్టు చేసి విచారించగా తానే తన కొడుకును హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడిని రిమాండ్ చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఆయన వెంట ఎస్సై మల్లారెడ్డి, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుల్ శ్రీశైలం ఉన్నారు.

# కాలువ పనులను త్వరగా పూర్తి చేయాలి


పెద్ద ఏడ్గి గ్రామ పెద్ద చెరువు కాలువ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

బిచ్కుంద(జుక్కల్), జూన్ 15 : జుక్కల్ మండలంలోని పెద్ద ఏడ్గి గ్రామ శివారులోని పెద్ద చెరువు కాలువ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అధికారులను ఆదేశించారు. పెద్ద ఏడ్గి గ్రామ శివారులోని పెద్ద చెరువు ప్రధాన కాలువ మరమ్మతు పనులను ఆదివారం పరిశీలించి మాట్లాడారు. కొంత కాలంగా ప్రధాన కాలువ మరమ్మతులు లేక పడావుగా మారిందన్నారు. కాలువ పనులు త్వరగా పూర్తయితే చెరువు ఆయకట్టుకింద సుమారు 600 ఎకరాలకు సాగు నీరు అందుతుందని పేర్కొన్నారు. ఆయనవెంట అధికారులు, గ్రామస్తులు ఉన్నారు.

# నేడు ప్రజావాణి

నాగిరెడ్డిపేట, జూన్15: స్థానిక తహసీల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు ఉంటుం దన్నారు. ప్రజలు గ్రామ సమస్యలు, వ్యక్తిగత సమస్యలపై నేరుగా వచ్చి ఫిర్యాదు చేసుకోవాలని సూచించారు. మండలంలోని ఆయా శాఖల అధికారులు సకాలంలో ప్రజావాణికి హాజరుకావాలని పేర్కొన్నారు.

# జగదాంబ ఆలయంలో దొంగతనం


హాజీపూర్ సడాక్‌తండా జగదాంబ సేవాలాల్ ఆలయంలో దొంగతనం జరిగిన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై బొజ్జ మహేశ్

ఎల్లారెడ్డి రూరల్, జూన్ 15: మండలంలోని హాజీపూర్ సడాక్ తండాలోని జగదాంబ సేవాలాల్ ఆలయంలోని గల్లాపెట్టెను దుండగులు తస్కరించారు. ఎల్లారెడ్డి ఎస్సై బొజ్జ మహేశ్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. తండాలో ఉన్న జగదాంబ సేవాలాల్ ఆలయ పూజారి దూప్యానాయక్ రోజులాగే పూజలు చేసి శుక్రవారం రాత్రి ఆలయానికి తాళం వేసి వెళ్లిపోయాడు. అర్ధరాత్రి సమయంలో ఆలయంలోకి ప్రవేశించిన దుండగులు హుండీని పగులగొట్టి అందులోని నగదును కాజేశారు. ఆదివారం ఉదయం ఆలయానికి వచ్చిన పూజారి హుండీ కనిపించకపోవడంతో తండావాసులకు సమాచారం ఇచ్చాడు. అందరూ కలిసి వెతుకగా ఆలయం పక్కన తాళాలు పగులగొట్టిన ఖాళీ హుండీ పడి ఉండడం కనిపించింది. దీంతో ఆలయంలో చోరీ జరిగిందని గమనించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, క్లూస్ టీం సభ్యులను పిలిపించి పరిస్థితిని సమీక్షించారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. గ్రామంలోని రోడ్డుపై దుకాణాలు, పలు కీలక స్థలాలు, ఆలయంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, వీటి ఏర్పాటుతో దొంగతనాలు జరిగిన సమయంలో దొంగలను సులువుగా పట్టుకోవచ్చని ఎస్సై సూచించారు. ఆయనతో పోలీసు సిబ్బంది, క్లూస్ టీం సభ్యులు ఉన్నారు.

# అ 'పూర్వ' సమ్మేళనం


లింగంపేట బాలుర ఉన్నత పాఠశాల 1989-90 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు


కామారెడ్డి సిద్ధార్థ జూనియర్ కాలేజీ 1999-2001 బ్యాచ్ ఇంటర్మీడియెట్ విద్యార్థులు


ఎల్లారెడ్డిలో పాల్గొన్న 1983-84 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు


గోపాల్‌పేట ఉన్నత పాఠశాలలో 2000-2001 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు

ఎల్లారెడ్డిరూరల్/నాగిరెడ్డిపేట/లింగంపేట/ కామారెడ్డి, జూన్ 15: ఎల్లారెడ్డి పట్టణంలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 1983-84 సంవత్సరంలో ఎల్లారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుకున్న విద్యార్థులు 42 ఏండ్లకు ఒకే దగ్గరకు చేరి తమ గత స్మృతులను నెమరువేసుకున్నారు. పట్టణమంతా బైకులపై కలియతిరిగారు. తమకు చదువు చెప్పిన ఆనాటి ఉపాధ్యాయులు నునుగొండ ఆంజనేయులు, మంజూరహ్మద్, కృష్ణమూర్తిని ఘనంగా సన్మానించారు.

గోపాల్‌పేట ఉన్నత పాఠశాలలో 2000-2001 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందించారు. ఈ సందర్భంగా తాము పాఠశాలలో చదువుకున్న రోజులను నెమరువేసుకున్నారు. అనంతరం అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు.

లింగంపేట మండల కేంద్రంలోని ఓ గార్డెన్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. లింగంపేట బాలుర ఉన్నత పాఠశాల 1989-90 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు కలుసుకొని తాము చదువుకున్న రోజుల్లో చేసిన చిలిపి పనులు నెమరు వేసుకుని ఆనందంగా గడిపారు.

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సిద్ధార్థ జూనియర్ కాలేజీలో 1999-2001 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియెట్ బైపీసీ చదివిన విద్యార్థుల సమ్మేళనాన్ని కామారెడ్డిలో నిర్వహించారు. 25 ఏండ్ల అనంతరం కలుసుకోవడంతో భావోద్వేగానికి గురయ్యారు. నాటి జ్ఞాపకాను నెమరువేసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో సరదాగా గడిపారు.

# తండ్రి సమాధి వద్ద నివాళులర్పించిన షిండే


డోన్‌గావ్ గ్రామంలో తన తండ్రి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే షిండే

బిచ్కుంద(జుక్కల్), జూన్15 : మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే తన తండ్రి మాదప్ప షిండే వర్ధంతిని ఆదివారం జుక్కల్ మండలంలోని డోన్‌గావ్ గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి సమాధి వద్దకు వెళ్లి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాదప్ప షిండే స్ఫూర్తితోనే ప్రజా సేవ చేస్తున్నానని అన్నారు. కార్యక్రమంలో యువ నాయకుడు హరీశ్ షిండే, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటిన యువకులు

లింగంపేట, జూన్15: మండలంలోని ముంబాజీపేట తండాలో ఆదివారం గిరిజన యువకులు మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ కోసం తండాల్లోని ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటినట్లు తెలిపారు. తండాకు చెందిన పలువురు యువకులు వివిధ రంగాల్లో ఉద్యోగాలు చేస్తున్న వారి సహకారంతో మొక్కలు నాటినట్లు బానోత్ నరేశ్ తెలిపారు. ఉద్యోగుల సహకారంతో తండాలో 30 కొబ్బరి, 20 మామిడి చెట్లు నాటినట్లు చెప్పారు. మొక్కల సంరక్షణ బాధ్యతనను తండావాసులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

## అందుబాటులో యూరియా

లింగంపేట, జూన్ 15: మండల కేంద్రంలోని సహకార సంఘంలో యూరి యా అందుబాటులో ఉన్న ట్లు సహకార సంఘం చైర్మ న్ దేవేందర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. వర్షాకాలంలో పంటలు సాగు చేస్తున్న రైతుల కోసం యూరియాను అందుబాటులో ఉంచామన్నారు. లింగంపేట సహకార సంఘం పరిధిలోని భవానీపేట, పోతాయిపలి, లింగంపేటలోని గోదాముల్లో యూరియా అందుబాటులో ఉన్నదన్నారు. రైతులు ఎరువుల కోసం ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదన్నారు. ఆయనవెంట సీఈవో పెంటయ్యతో, సహకార సంఘం సిబ్బంది ఉన్నారు.

## సాధనా సమితి ఆధ్వర్యంలో జెండావిష్కరణ

రామారెడ్డి, జూన్ 15 : మండల కేంద్రంలో ఆదివారం బస్టాండ్ ఆవరణలో ఆలోచన సాధనా సమితి ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. దీనికి బీసీ కులాల నాయకులు పార్టీలకు అతీతంగా పాల్గొన్నారు. అగ్రవర్ణాల ఆధిపత్యాన్ని అణగదొక్కి వెనుకబడిన బీసీ కులాలు రాజ్యాధికారం పొందేలా చేయడమే సాధన సమితి లక్ష్యమని సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సమితి సభ్యులు పిప్పరి లింబాద్రి, పొట్టిగారి విజయ్ కుమార్, యాదగిరి, బద్రి తదితరులు పాల్గొన్నారు.

## నేడు రెవెన్యూ గ్రామసభలు

నాగిరెడ్డిపేట, జూన్ 15: మండలంలోని వదలపర్తి, కన్నారెడ్డి గ్రామాల్లో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. గ్రామంలోని రైతులు తమ భూ సమస్యలు, ఇబ్బందులపై సదస్సులో దరఖాస్తులు చేసుకొని సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

## ఉచిత నేత్ర వైద్య శిబిరానికి స్పందన


బీబీపేట్‌లో ఏర్పాటుచేసిన నేత్ర వైద్య శిబిరం

బీబీపేట్, జూన్ 15: మండల కేంద్రంలో ఛత్రపతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎల్‌వీ ప్రసాద్ కంటి దవాఖాన సౌజన్యంతో స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద శిబిరాన్ని ఏర్పాటుచేశారు. మొత్తం 121మంది నేత్ర పరీక్షలు చేయించుకున్నట్లు ఛత్రపతి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పెరుమాండ్ల తెలిపారు. కార్యక్రమంలో ఛత్రపతి ఫౌండేషన్ బాధ్యులు, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బోర్లం క్లస్టర్‌కు వీడియో కాన్ఫరెన్స్ యూనిట్ మంజూరు

బాన్సువాడ రూరల్, జూన్ 15: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, వ్యవసాయశాఖ బోర్లం క్లస్టర్‌కు రైతు నేస్తం కార్యక్రమం ద్వారా వీడియో కాన్ఫరెన్స్ యూనిట్‌ను మంజూరు చేసింది. రైతులకు నేరుగా వ్యవసాయానికి సంబంధించిన సలహాలు, సూచనలు ఇవ్వడానికి, ప్రత్యక్ష ప్రసారం ద్వారా రైతులు వీక్షించి వారి సందేహాలు నివృత్తి చేసుకోవడానికి రైతువేదికలకు వీడియో కాన్ఫరెన్స్ సెట్‌ను అనుసంధానం చేస్తారు. బోర్లం క్లస్టర్ పరిధిలోని తాడ్కోల్ రైతు వేదికలో ఏర్పాటు చేసిన యూనిట్‌ను సోమవారం మధ్నాహ్నం 3గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్ నుంచి ప్రత్యక్ష ప్రసారం ద్వారా ప్రారంభిస్తారని ఏఈవో రాణి ఆదివారం తెలిపారు. బోర్లం క్లస్టర్ పరిధిలోని బోర్లం, బోర్లం క్యాంప్, జక్కల్‌దాని తండా, తాడ్కోల్, బుడ్మి, కొత్తాబాది, తిర్మాలాపూర్, మొగులాన్‌పల్లి, కొయ్యగుట్ట తండా గ్రామాల రైతులతోపాటు మండలానికి చెందిన మాజీ ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని కోరారు. ప్రతి మంగళవారం ఉదయం 10 నుంచి మధ్నాహ్నం 12 గంటల వరకు రైతు నేస్తం కార్యక్రమం ఉంటుందని ఆమె తెలిపారు.

***పర్మళ్ల, ముంబాజీపేట రైతువేదికలకు..***

లింగంపేట, జూన్ 15: మండలంలోని పర్మళ్ల, ముంబాజీపేట గ్రామాల్లోని రైతు వేదికలకు వీడియో కాన్ఫరెన్స్ యూనిట్లు మంజూరైనట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి అనిల్‌కుమార్ ఆదివారం తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ యూనిట్లను సోమవారం ప్రారంభిస్తామని పేర్కొన్నారు. వీడియో కన్ఫరెన్స్ సెట్‌ల ద్వారా రైతు నేస్తం కార్యక్రమం ప్రత్యక్షంగా వీక్షించవచ్చని వెల్లడించారు.

**మహ్మద్‌నగర్, గాలీపూర్ రైతు వేదికలకు..**

నిజాంసాగర్, జూన్ 15: మహ్మద్‌నగర్ మండలంలోని మహ్మద్‌నగర్, గాలీపూర్ రైతు వేదికలకు నూతనంగా రైతు నేస్తం కార్యక్రమం కింద వీడియో కాన్ఫరెన్స్ యూనిట్స్‌ను మంజూరు చేశారని మండల వ్యవసాయ అధికారిణి నవ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు నేరుగా వ్యవసాయానికి సంబంధించిన సలహాలు, సూచనలు ఇవ్వడానికి ప్రత్యక్ష ప్రసారం ద్వారా రైతులు వీక్షించి వారి సందేహాలు నివృత్తి చేసుకోవడానికి రైతు వేదికలకు వీడియో కాన్ఫరెన్స్ అనుసంధానం చేశారని పేర్కొన్నారు.

## 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె

ఖలీల్‌వాడి, జూన్ 15 : కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు వచ్చే నెల 9న నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక సంఘాల నాయకులు కోరారు. నగరంలోని కోటగల్లీలో ఉన్న ఎన్‌ఆర్ భవన్‌లో కార్మిక సంఘాల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. టీయూసీఐ జిల్లా ప్రధానకార్యదర్శి సుధాకర్, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి ఓమయ్య, సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి నూర్జహాన్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు భూమయ్య మాట్లాడుతూ.. 11 ఏండ్ల మోదీ ప్రభుత్వపాలనలో కార్మికుల జీవన ప్రమాణాలు పడిపోయాయన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు మొయినుద్దీన్, భూమేశ్, ఆజాద్ తదితరులు పాల్గొన్నారు.

# గడీకోటలో సామూహిక అక్షరాభ్యాసం


విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేసిన గడీకోట వారసులు

బీబీపేట్ (దోమకొండ), జూన్ 15: దోమకొండలోని గడీకోటలో ఆదివారం గడీకోట వారసుడు కామినేని అనిల్ ఆధ్వర్యంలో చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. ముందుగా సరస్వతీ పూజ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన కామినేని అనిల్, రాజేశ్వర్ కలిసి పదో తరగతిలో ప్రతిభ చూపిన ఐదుగురు విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచిన సుమయ, నవదీప్‌కు రూ.25వేల చొప్పున, సన్నితకు రూ.20వేలు, రేవతికి రూ.18వేలు, రాహుల్‌కు రూ.15వేల చొప్పున ఉపకార వేతనం అందజేశారు. కార్యక్రమంలో గడీకోట ట్రస్ట్ మేనేజర్ బాల్జి, ప్రతినిధులు గణేశ్‌యాదవ్, రాజశేఖర్, ఆనంద్, మాజీ జడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, సొసైటీ చైర్మన్ నాగరాజ్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ


రాజంపేటలో నోటు బుక్కులు పంపిణీ చేస్తున్న గంగపుత్ర చారిటబుల్ ట్రస్టు బాధ్యులు


క్యాసంపల్లిలో ఫ్రెండ్స్ హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో..

రాజంపేట్, జూన్ 15: రాజంపేట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మండల కేంద్రంలోని గంగపుత్ర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నోటు బుక్కులు అందజేశారు. ఏడు నుంచి పదో తరగతి చదువుతున్న 250మంది విద్యార్థులకు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో పూర్ణచంద్రారావు మాట్లాడుతూ.. విద్యార్థులను చదువులో ప్రోత్సహించేందుకు ట్రస్టు సభ్యులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. హెచ్‌ఎంలు ఈశ్వరయ్య, విజయలక్ష్మి, ట్రస్ట్ సభ్యులు బక్కి దుర్గయ్య, కుంట నర్సింహులు, సుందరి, కుంట ఎల్లయ్య, బక్కి భాస్కర్‌రావు, పంపరి సంజీవులు, కుంట రాములు, సాయిలు, కిషన్, విఠల్‌రావు, చందు, గంగాధర్, అరుణేశ్, శరత్‌కుమార్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

***ఫ్రెండ్స్ హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో..***

కామారెడ్డి రూరల్, జూన్ 15: క్యాసంపల్లి మండల పరిషత్ పాఠశాల విద్యార్థులకు హైదరాబాద్‌కు చెందిన ఫ్రెండ్స్ హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో ఆదివారం నోటు బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫ్రెండ్స్ హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు మాట్లాడుతూ.. భవిష్యత్తులో పాఠశాల అభివృద్ధిలో తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఫ్రెండ్స్ హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులను సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయ బృందం, స్కూల్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## బదీలిపై వెళ్తున్న కానిస్టేబుళ్లకు సన్మానం

బీబీపేట్, జూన్ 15: బీబీపేట పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించి, బదిలీపై వెళ్తున్న పలువురు కానిస్టేబుళ్లను ఎస్సై ప్రభాకర్, పోలీసు సిబ్బంది ఆదివారం ఘనంగా సన్మానించారు. వివిధ పోలీస్‌స్టేషన్లకు బదిలీ అయిన రంజిత్‌గౌడ్, శంకర్, రాజుకు శాలువాలు కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. విధులను క్రమశిక్షణతో చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


కానిస్టేబుళ్లను సన్మానిస్తున్న ఎస్సై, సిబ్బంది

## కోమలంచలో గంగమ్మ పండుగ


బోనాలను ఊరేగిస్తున్న కోమలంచ గ్రామస్తులు

నిజాంసాగర్, జూన్ 15: మహ్మద్‌నగర్ మండలం కోమలంచ గ్రామంలో ఆదివారం గంగమ్మ పండుగను గంగపుత్ర సంఘం సభ్యులు, గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా ప్రతి ఇంటి నుంచి బోనాలను ఊరేగింపుగా గంగమ్మ గుడి వద్దకు తీసుకెళ్లారు. అమ్మవారికి సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పిల్లాపాపలు చల్లగా ఉండాలని వేడుకున్నారు. కార్యక్రమంలో గంగపుత్ర సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# శ్రీశ్రీకి ఘన నివాళి

కామారెడ్డి, జూన్ 15 : ప్రముఖ కవి శ్రీశ్రీ వర్ధంతిని జిల్లా కేంద్రంలోని కర్షక్ బీఈడీ కాలేజీలో తెలంగాణ రచయితల వేదిక(తెరావే) ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ.. శ్రీశ్రీ ఒక అభ్యుదయ, విప్లవ కవిగా, శ్రామిక వర్గానికి ప్రతినిధిగా చేసిన రచనలు తెలుగు సాహిత్యంలో విప్లవాత్మక మార్పులు తెచ్చాయని కొనియాడారు. ఆయన రచనలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం అన్నారు. కార్యక్రమంలో తెరవే జిల్లా అధ్యక్షుడు గఫూర్ శిక్షక్, ప్రతినిధులు గంగాప్రసాద్, కాసర్ల రాంచంద్రం, నాగభూషణం, చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.


శ్రీశ్రీ చిత్ర పటానికి పూలమాల వేస్తున్న తెరవే బాధ్యులు

# 7న డప్పులతో గ్రామాలు దద్దరిల్లాలి

రామారెడ్డి, జూన్15 : జూలై 7 న దండోర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గ్రామాలు డప్పులతో దద్దరిల్లాలని ఎమ్మార్పీఎస్ జిల్లా పర్యవేక్షకుడు మంథని సామేల్ అన్నారు. ఆదివారం మండలంలోని ఉప్పల్‌వాయి, కన్నాపూర్ తదితర గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కన్నాపూర్‌లో నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.


నినాదాలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

## సైబర్ మోసం.. బ్యాంకు ఖాతా నుంచి రూ.లక్షా 20వేలు మాయం

బాన్సువాడ, జూన్ 15: బాన్సువాడలో సైబర్ నేరం వెలుగుచూసింది. అర్ఫత్ కాలనీకి చెందిన వ్యాపారి సయ్యద్ రఫీ ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు రూ.లక్షా 20వేలు కాజేశారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. రఫీ ఖాతా నుంచి రూ.పదివేలు డ్రా అయినట్లు ఈనెల 5వ తేదీన నిజామాబాద్‌కు వెళ్తుండగా ఫోన్‌కు సందేశం వచ్చింది. కాసేపటికి మరో పది వేలు డ్రా అయినట్లు మెసేజ్ వచ్చింది. ఫోన్ పేలో బ్యాలెన్స్ చెక్ చేసుకొని 20వేలు డ్రా అయినట్లు గుర్తించారు. మరుసటి రోజు ఆయనకు బంధువులు రూ.లక్షా30వేలు పంపించారు. ఆ డబ్బులు ఇతరులకు పంపించాల్సి ఉండగా.. ఈనెల 7వ తేదీన ఫోన్ పేలో ట్రాన్స్‌ఫర్ చేసేందుకు ప్రయత్నించగా.. వెళ్లలేదు. అప్పటికే లక్ష రూపాయలు డ్రా అయినట్లు గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వెంటనే బ్యాంకు అధికారులకు సమాచారం అందించగా.. వారు పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు.